**Eenadu**

# 5 లక్షల కోట్లు.. 10 లక్షల కొలువులు

**• పథకాలపై పెట్టుబడి.. ఉద్యోగావకాశాలపై సమీక్ష**

**ఈనాడు, అమరావతి:** రాష్ట్రంలో రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులతో చేపడుతున్న వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం 10లక్షల మందికిపైగా ఉద్యోగాలు కల్పించనుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విభాగాల్లో చేపడుతున్న పథకాలు, వాటికి పెడుతున్న పెట్టుబడి, తద్వారా కలిగే ఉద్యోగావకాశాలపై ప్రభుత్వం సమీక్షించింది. ఏమాత్రం పురోగతి లేకుండా ఉన్న పథకాలన్నింటినీ మినహాయించి కొంతైనా పురోగతి ఉన్న పథకాలనే పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాజెక్టులపై కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అన్ని విభాగాల్లో కలిపి ఏదో ఒక దశలో ఉన్న ప్రాజెక్టులు మొత్తం 927 ఉండగా.. వాటిపై పెడుతున్న పెట్టుబడి మొత్తం రూ.5,03,978 కోట్లు. దీని ద్వారా 10,05,506 మందికి ఉద్యోగాలు కల్పించనుంది. ఇప్పటికే 517 ప్రాజెక్టులు నిర్మాణాలు ప్రారంభమవడం, పూర్తికానున్న దశల్లో ఉన్నాయి. వాటిపై ప్రభుత్వం రూ.1,43,633 కోట్లు ఖర్చుపెట్టి 2,23,385 మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. మరో 410 ప్రాజెక్టులు శంకుస్థాపనలు, స్థల సేకరణ, ప్రభుత్వ అనుమతులు, డీపీఆర్‌ల సమర్పణ దశల్లో ఉన్నాయి. వాటిపై రూ.3,60,345 కోట్లు ఖర్చుపెట్టడం ద్వారా 7,82,121 మందికి ఉద్యోగాలు కల్పించనుంది.

**పరిశ్రమలశాఖ వాటా రూ.3లక్షల కోట్లు:** రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న మొత్తం ప్రాజెక్టుల్లో పరిశ్రమల శాఖవాటా రూ.3లక్షల కోట్లకుపైనే ఉంది. ఈ శాఖ 375 ప్రాజెక్టులను రూ.3,31,650 కోట్లతో చేపడుతోంది. దీని ద్వారా 7,77,043 మందికి ఉద్యోగాలు కల్పించనుంది. ఇందులో ఇప్పటికే పనులు ప్రారంభమై పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు 229 ఉన్నాయి. వాటి విలువ రూ.43,750 కోట్లు. మరో 146 ప్రాజెక్టులు శంకుస్థాపనలు, స్థల సేకరణ, ప్రభుత్వ అనుమతులు, డీపీఆర్‌ల సమర్పణల దశలో ఉన్నాయని, వాటి విలువ 2,87,900 కోట్లు అని ప్రభుత్వం తెలిపింది.